సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శనివారం ; 23 ; సెప్టెంబర్ ; 2023



హెవీ వెహి'కిల్స్'

కేటీపీఎస్‌కు నిత్యం రవాణా సాగిస్తున్న యాష్ ట్యాంకర్ల అతివేగంతో ప్రమాదాలు జరిగి పలువురి ప్రాణాలు పోతున్నాయి. 8లో



హస్తినలో ఆశావహులు

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు హస్తిన బాట పట్టారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31° / 25°

జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచాలతో రామయ్య దర్శనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలో మూల మూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం జరిపారు.

వైభవంగా పంచామృతాభిషేకం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం జరిపారు. అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, పంచ హారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం, కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింత నాగరాజు, గంధం వెంగళరావు, ఎస్వీఆర్‌కే ఆచార్యులు, సంకా వెంకటరామారావు, లక్ష్మీనారాయణ భక్తులు పాల్గొన్నారు.

అంజన్నకు వెండి మండపం..



స్వామివారి సేవలో ఆలయ కమిటీ సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని తాతగుడి సెంటర్‌లో దాసాంజనేయ స్వామివారికి భక్తులు బహూకరించిన రుద్రాక్ష వెండి మండపాన్ని శుక్రవారం అలంకరించారు. ఆలయ కమిటీ, భక్తుల నుంచి ఏడాదిపాటు సేకరించిన విరాళాలతో సుమారు 50 కిలోల వెండితో ఈ మండపం తయారు చేయించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సాయిబాబు తెలిపారు. కార్యదర్శి కటుకూరి హరిబాబు, గంటా కృష్ణ, ద్రాక్షారామం శ్రీను, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యే కేసుపై తీర్పు వాయిదా

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఎమ్మెల్యేగా వనమా వెంకటేశ్వరరావు అనర్హుడని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ కేసులో హైకోర్టు తీర్పుపై ఇప్పటికే సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈమేరకు శుక్రవారం విచారణ జరగగా ఇరువర్గాల న్యాయవాదుల వాదనలు విన్న న్యాయమూర్తి హైకోర్టు తీర్పుపై ఇచ్చిన స్టేకు సంబంధించి తీర్పును వాయిదా వేశారు. దీంతో హైకోర్టు తీర్పుపై స్టే కొనసాగుతున్నట్లయింది.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించుకోవాలి

అశ్వారావుపేటరూరల్: ప్లాస్టిక్ లేని సమాజాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ ఐవీ శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో శుక్రవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బందికి క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ విపత్తు పొంచి ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తగ్గించుకోవాలని చెప్పారు. ప్రొఫెసర్లు డాక్టర్ నాగాంజలి, జంబమ్మ, డాక్టర్ టి.పావని, డాక్టర్ పి.నీలిమ, స్రవంతి, డాక్టర్ రెడ్డిప్రియ, డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్ కె.శిరీష పాల్గొన్నారు.

యూరియా దొరకట్లే..

- ఈ సీజన్‌లో 34 మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా
- ఇప్పటివరకు జిల్లాకు 28 మెట్రిక్ టన్నులే సరఫరా
- జిల్లాలో పెరిగిన వానాకాలం పంటల సాగు విస్తీర్ణం
- ఇటీవల వర్షాలతో మెట్ట, మాగాణిలకు ఒకేసారి అదును
- ఇదే అవకాశంగా అధిక ధరకు విక్రయిస్తున్న ప్రైవేట్ డీలర్లు



యూరియా కోసం బూర్గంపాడు పీఏసీఎస్‌లో ఎదురుచూస్తున్న రైతులు

బూర్గంపాడు: జిల్లాలో యూరియా కొరత ఏర్పడటంతో రైతులకు తిప్పలు తప్పటం లేదు. రోజుల తరబడి యూరియా కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. రెండు రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తుండగా, రైతులు మెట్ట, మాగాణి పంటలకు ఎరువులు వేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో యూరియాకు డిమాండ్ ఏర్పడింది. ఎరువుల విక్రయ కేంద్రాల్లో సరిపడా నిల్వలు లేవు.

వర్షాలతో పెరిగిన డిమాండ్..

జిల్లాలో ఈ ఏడాది 3.75 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం వానాకాలం సీజన్‌లో జిల్లాలో 34 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముంటుందని అంచనా వేశారు. ఇప్పటికే జిల్లాకు సుమారు 28వేల మెట్రిక్ టన్నుల వరకు యూరియా సరఫరా చేశారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వానలు కురుస్తుండటంతో పత్తి, మిర్చి, అపరాలు, కూరగాయల పంటలతోపాటుగా వరి మాగాణులకు కూడా ఎరువులు వేసుకోవాల్సిన అదును కావటంతో రైతులు యూరియా కోసం ఎగబడుతున్నారు. యూకలిప్టస్, పామాయిల్ తోటలకు కూడా రైతులు యూరియా వేసుకుంటున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. ఈ పరిస్థితుల్లో పంటలకు సరిపడా యూరియా అందుబాటులో ఉండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ డీలర్ల వద్ద బస్తాకు రూ.80 అదనం..

జిల్లాలో 20 పీఏసీఎస్ ఎరువుల విక్రయ కేంద్రాలతోపాటు 13 ఆగ్రోస్ సెంటర్లు, 480కి పైగా ప్రైవేటు డీలర్ షాపులు ఉన్నాయి. జిల్లాకు వస్తున్న యూరియాలో 60శాతం మేర పీఏసీఎస్, ఆగ్రోస్ కేంద్రాలకే సరఫరా అవుతోంది. ప్రైవేట్ డీలర్లకు 40శాతం మాత్రమే అందిస్తున్నారు. అయితే ప్రైవేట్ డీలర్లకు అందే యూరియాకు సంబంధించి ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు కూడా డీలర్లే చెల్లించాల్సి వస్తుంది. దీంతో ప్రైవేట్ డీలర్లు యూరియాను ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. పీఏసీఎస్ కేంద్రాలలో యూరియా బస్తా రూ. 267కు విక్రయిస్తుంటే, ప్రైవేట్ డీలర్లు మాత్రం రూ.330 నుంచి రూ.350 వరకు వసూలు చేస్తున్నారు. దీనికి తోడు యూరియా కొంటే కాంప్లెక్స్ ఎరువులు, గుళికలు వంటి మందులను తప్పనిసరిగా కొనాలని డీలర్లు మెలికపెడుతున్నారు. పీఏసీఎస్ గోదాంలలో యూరియా లేదనే విషయం తెలిస్తే ప్రైవేట్ డీలర్లు యూరియాను బ్లాక్ చేస్తున్నారు. అదును దాటిపోతుండటంతో ఎక్కువ ధరకు కొనక తప్పడంలేదని రైతులు వాపోతున్నారు. అవసరాలకు అనుగుణంగా అధికారులు యూరియాను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

అదును దాటుతోంది..



పదిహేను రోజుల నుంచి యూరియా సరిగా దొరకటం లేదు. దీంతో అదునులో ఎరువులు వేసుకోలేక పోతున్నాం. ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా రేటు ఎక్కువగా ఉంది. అదికూడా కాంప్లెక్స్ ఎరువులకు ముడిపెట్టి అమ్ముతున్నారు.

– దారం రాజశేఖర్‌రెడ్డి, రైతు

దొరకడం లేదు



మూడురోజుల నుంచి యూరియా కోసం తిరుగుతున్నా దొరకడం లేదు. ఈ రోజు పీఏసీఎస్ గోదాంకు యూరియా వచ్చిందని తెలిసి వెళితే గంటలోనే యూరియా అయిపోయిందన్నారు. వరిలో కలుపు తీసి ఎరువు వేద్దామంటే యూరియా అందుబాటులో లేదు.

– గంపల శ్రీనివాస్, రైతు

ఇబ్బందిగానే ఉంది



ఈ ఏడాది యూరియా అదునులో దొరకటం లేదు. యూరియా కోసం రెండు మూడ్రోజులు ఎదురుచూడాల్సి వస్తుంది. రెండురోజుల నుంచి వానపడుతుంది. పత్తికి మందులు వేద్దామంటే యూరియా దొరకటం లేదు. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

– నిమ్మల రాములు, రైతు

వర్షాలతో డిమాండ్ పెరిగింది



ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో యూరియాకు డిమాండ్ పెరిగింది. అయినా యూరియా రైతులకు సరిపడా సరఫరా అవుతోంది. జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదు. వర్షాల కారణంగా ఏర్పడిన డిమాండ్ ఒకట్రెండు రోజుల్లో సర్దుబాటు అవుతుంది.

– తాతారావు, ఏడీఏ, మణుగూరు



ఎంసీహెచ్‌లో బాలింతలు

కడుపు 'కోత'

- ఆపరేషన్లతో మాతృమూర్తులకు జీవిత కాలపు వేదన
- కాన్పులను సొమ్ము చేసుకుంటున్న ప్రైవేట్ ఆస్పత్రులు
- 70 శాతానికి పైగా ప్రసవాలకు శస్త్రచికిత్సలు చేస్తున్న వైద్యులు
- అవసరం లేకపోయినా సిజేరియన్ చేస్తున్నట్లు గుర్తింపు
- జిల్లాలో 20 హాస్పిటళ్లపై వైద్యారోగ్యశాఖ ఆగ్రహం

కొత్తగూడెంరూరల్: ప్రైవేట్ వైద్యుల కాసుల కక్కుర్తి తల్లులను కడుపు కోతకు గురిచేస్తోంది. అవసరం ఉన్నా, లేకపోయినా గర్భిణులకు సిజేరియన్లు చేస్తుండగా, అమ్మ శరీరం మరింత బలహీనమవుతోంది. అనారోగ్యం బారిన పడుతోంది. సాధారణ కాన్పుల సంఖ్య పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశిస్తున్నా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు.

అవసరమైతేనే సిజేరియన్ చేయాలని ఆదేశాలున్నా..

ప్రభుత్వం గర్భిణులపై ప్రత్యేకంగా దృష్టి సారించి, మెరుగైన వైద్య సేవలందిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే గర్భిణులకు కేసీఆర్ కిట్‌తోపాటు, సుఖప్రసవం కోసం అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు తగ్గించాలని, సాధారణ కాన్పుల సంఖ్య పెంచాలని వైద్యశాఖ ఉన్నతాధికారులు డాక్టర్లను ఆదేశించారు. అవసరమైతే తప్ప సిజేరియన్ చేయొద్దని, అనవసరంగా చేస్తే అందుకు బాధ్యత వహించాలని హెచ్చరికలు కూడా జారీ చేశారు. కానీ జిల్లాలోని ప్రైవేట్ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి.

20 ఆస్పత్రులకు షోకాజ్ నోటీస్‌లు

జిల్లాలో మొత్తం 38 ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో 20 ఆస్పత్రుల్లో గత మూడు నెలల కాలంలో గైనకాలజిస్టులు 70 శాతానికి పైగా సిజేరియన్లు చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లు కాసుల కోసం ఆశ పడి సాధారణ కాన్పులకు బదులు ఆపరేషన్లు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సదరు ఆస్పత్రుల యాజమాన్యాలపై డీఎంహెచ్‌ఓ శిరీష ఆగ్రహం వ్యక్తం చేసి, షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పద్ధతులు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం సాధారణ కాన్పుల సంఖ్య పెంచేలా దృష్టి సారించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని నోటీస్‌ల్లో పేర్కొన్నారు. కొత్తగూడెంలో 8 ప్రైవేట్ ఆస్పత్రులు, భద్రాచలంలో 6, మణుగూరులో 4, పాల్వంచలో 2, ఇల్లెందులో 2 ఆస్పత్రులకు షోకాజ్ నోటీస్‌లు జారీ చేశారు.

ఇవీ అనర్థాలు

మహిళలకు సాధారణ కాన్పు బదులు ఆపరేషన్ చేస్తే శరీరంలో ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంది. ఆపరేషన్ సమయంలో రక్తం ఎక్కువగా పోతుంది. మత్తు ఇంజెక్షన్ వల్ల వెన్ను నొప్పి వస్తుంది. మొదటి కాన్పు సిజేరియన్ చేస్తే రెండో కాన్పు కూడా సిజేరియనే చేయాలి. ఏదైనా పనులు చేస్తే నొప్పులు వస్తాయి. గర్భిణి పొట్టపై ఏడు పొరలు ఉంటాయి. సిజేరియన్ వల్ల ఆ పొరలకు అతుకులు వస్తాయి.

సాధారణ కాన్పులతో లాభాలు..

సాధారణ కాన్పుల వల్ల మహిళల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. రెండో కాన్పు కూడా సాధారణ కాన్పు అయ్యే అవకాశం ఉంటుంది. పుట్టిన బిడ్డకు మదర్ ఫీడింగ్ ఎక్కువగా ఉంటుంది. దీంతో తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు. ఇన్ఫెక్షన్లు తక్కువగా ఉంటాయి.

ఆరోగ్య సమస్యలు వస్తాయి



గర్భిణులకు సిజేరియన్ చేస్తే రక్తం తగ్గిపోతుంది. మత్తు వల్ల వెన్ను పూస నొప్పి వస్తుంది. ఆస్పత్రిలో ఎక్కువ రోజులు ఉండటం వల్ల శరీరంలో ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంది. సాధారణ కాన్పు వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలూ రావు.

– డాక్టర్ సింధు, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల

చర్యలు తీసుకుంటాం



జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు తగ్గించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని 20 ప్రైవేట్ ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చాం. సిజేరియన్లు తగ్గించాలని ఆదేశాలు జారీ చేశాం. వారు వినకపోతే చర్యలు తీసుకుంటాం.

– శిరీష, డీఎంహెచ్‌ఓ

ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని సాధించాలి

సమీక్షలో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఆయిల్‌పామ్ లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగు ప్రగతిపై వ్యవసాయ, ఉద్యాన అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఈ యేడాది జిల్లాలో 20,500 ఎకరాల్లో కొత్తగా సాగు లక్ష్యం నిర్ణయించినట్లు తెలిపారు. క్లస్టర్ల వారీగా లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. మొక్కలు ఇచ్చేందుకు రైతుల నుంచి ఎకరానికి రూ.1140 చొప్పున డీడీలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఎకరానికి రూ. 50 వేల చొప్పున నాలుగేళ్లపాటు రాయితీ కల్పిస్తుందన్నారు. క్లస్టర్ల వారీగా లక్ష్యాలు సాధించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కొర్సా అభిమన్యుడు, జిల్లా ఉద్యాన శాఖాధికారి జినుగు మరియన్న, డీసీఓ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పంట రుణాలు రెన్యూవల్ చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో రుణమాఫీ అయిన రైతులకు తక్షణమే పంట రుణాలు రెన్యూవల్ చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల వ్యవసాయాధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రుణమాఫీ పథకం లబ్ధిదారుల డీబీటీ పూర్తి చేయాలని సూచించారు. డీబీటీ విఫలమైన రైతుల వివరాలు క్లస్టర్ల వారీగా ఏఈఓలు సేకరించి, డీబీటీ పూర్తయ్యేలా చూడాలన్నారు. జిల్లాలో మొత్తం 418 మందికి రైతులకు సంబంధించి డీబీటీ ఫెయిల్ కాగా, ఇప్పటివరకు 32 రికార్డులను మాత్రమే అప్‌లోడ్ చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. పంటలకు కావాల్సిన యూరియా తదితర ఎరువుల అవసరం, అందుబాటులో ఉన్న ఎరువుల పరిమాణం, సరఫరా ప్రణాళిక తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

30న భద్రాచలానికి కేటీఆర్ రాక



మంత్రి కల్వకుంట్ల తారక రామారావు

భద్రాచలం: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, మున్సిపాలిటీ శాఖల మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఈ నెల 30న భద్రాచలం రానున్నారు. శ్రీ సీతారామ చంద్రస్వామి క్షేత్రంలో తొలిసారిగా అడుగుపెట్టనున్నారు. రోడ్‌షోలో కూడా పాల్గొంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉన్న కరకట్టను మరో 500 మీటర్ల వరకు పెంచేందుకు సుమారు రూ.35 కోట్ల విడుదల, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి ప్రకటన చేస్తారని పేర్కొంటున్నాయి. శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకోనున్నట్లు సమాచారం. కాగా కేటీఆర్ పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు శుక్రవారం భద్రాచలం బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల అభ్యర్థి తెల్లం వెంకట్రావు కలిసి చర్చించారు. కేటీఆర్ పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. పార్టీ నాయకులు అరికెల తిరుపతిరావు, నక్కా ప్రసాద్, మల్లెల లోకేష్, సతీష్ పాల్గొన్నారు.

చైర్మన్‌తో కలువబోం

- ప్రకటన జారీ చేసిన 12 మంది కౌన్సిలర్లు
- ఇల్లెందు మున్సిపాలిటీలో ఆరని వర్గపోరు



సింగరేణి గెస్ట్ హౌస్‌లో సమావేశమైన కౌన్సిలర్లు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ల మధ్య సయోధ్య కుదిరినా కొందరు కౌన్సిలర్లు మాత్రం తాము కలిసేది లేదని పేర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం ఖమ్మంలో కొందరు పెద్దల సమక్షంలో జరిగిన సమావేశంలో చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా మధ్య సయోధ్య కుదిరింది. ఆ తర్వాత ఇరువురు తమ వైపు కౌన్సిలర్లతో పలు దఫాలుగా చర్చించారు. చైర్మన్ వెంట ఉన్న కౌన్సిలర్లు సయోధ్యకు సమ్మతించగా, వైస్ చైర్మన్ వెంట ఉన్న కౌన్సిలర్లు ససేమీరా అంటున్నారు. శుక్రవారం సింగరేణి గెస్ట్ హౌస్‌లో 12 మంది కౌన్సిలర్లు కొక్కు నాగేశ్వరరావు, జేకే శ్రీనివాస్, తోట లలిత శారద, సామల మాధవి, సిలివేరు అనిత, కడకంచి పద్మ, పత్తి స్వప్న, సందా బింధు, చీమల సుజాత, గిన్నారపు రజిత, పాబోలు స్వాతీకిరణ్, వి.తార సమావేశమై మున్సిపల్ చైర్మన్‌తో కలిసేది లేదని ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయనకు వ్యతిరేకంగా, ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం పని చేస్తామని, చైర్మన్‌ను గద్దె దించటం ఖాయమని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ కలిసి వెళ్లినా తాము మాత్రం కలువబోమని స్పష్టం చేశారు. దీంతో ఇల్లెందు పురపాలికలో అధికార పార్టీలో విభేదాలు సమసిపోయే పరిస్థితి కనిపించడంలేదు.

విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేయాలి

- గిరిజన విద్యార్థులకు మెరుగైన బోధనతోనే సాధ్యం
- భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



రాజుపేట పాఠశాలలో విద్యార్థి సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం/దుమ్ముగూడెం: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధన చేయడం ద్వారా విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలం రాజుపేట కాలనీలోని జీపీఎస్, దుమ్ముగూడెం మండలంలోని రామచంద్రునిపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనం, డిజిటల్ తరగతులను పరిశీలించడమే కాక విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ప్రతీ విద్యార్థి ప్రావీణ్యత సాధించేలా బోధన సాగాలని తెలిపారు. కాగా, రాజుపేట పాఠశాలలో గ్రీన్ బోర్డ్ రంగు వెలిసిపోవడంతో పెయింటింగ్ వేయించాలని హెచ్‌ఎంకు పీఓ నగదు అందచేశారు. కాగా, అండర్ 15 మిక్స్‌డ్ డబుల్స్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలు, రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పతకాలు సాధించిన కురుసం కృష్ణను పీఓ తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమాల్లో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, హెచ్‌ఎంలు బాసియా, వీరమ్మ, భద్రమ్మ, పీడీ వెంకటనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రైకార్ రుణాల గ్రౌండింగ్ పూర్తి చేయాలి

భద్రాచలంటౌన్: ట్రైకార్ రుణాలకు సంబంధించిన 2020–21 ఆర్థికసంవత్సరం లబ్ధిదారుల గ్రౌండింగ్ త్వరగా చేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో బ్యాంకు అధికారులతో శుక్రవారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ ట్రైకార్ లబ్ధిదారుల గ్రౌండింగ్‌లో జాప్యం జరగకుండా చూడాలన్నారు. ఈమేరకు 26,27వ తేదీల్లో అశ్వారావుపేట, ములకలపల్లి, టేకులపల్లి, జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి మండలాలకు చెందిన 185 లబ్ధిదారుల సర్టిఫికెట్ల పరిశీలన కోసం ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా, ఇప్పటికే 344మంది లబ్ధిదారులకు సబ్సిడీ విడుదల చేశామనిచెప్పారు. ఈసమావేశంలో అధికారులు సురేష్‌బాబు, రామిరెడ్డి, వెంకటేశ్వర్లు, రవిశంకర్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జేఎల్ పరీక్ష ప్రశాంతం

సుజాతనగర్: అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జూనియర్ లెక్చరర్(జేఎల్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 130 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, పేపర్–1 పరీక్షకు 95 మంది హాజరయ్యారు. 35 మంది గైర్హాజరయ్యారు. పేపర్–2 పరీక్షకు 102 మంది హాజరు కాగా, 28 మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. పలువురు అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా రాగా నిర్వాహకులు వారిని పరీక్షకు అనుమతించలేదు.

సబ్‌స్టేషన్లను పరిశీలించిన ఎన్పీడీసీఎల్ డైరెక్టర్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆపరేషన్స్ పరిధిలోని పలు సబ్‌స్టేషన్లను శుక్రవారం టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.మోహన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా రూ.1.4 కోట్లతో ఖమ్మం అల్లీపురంలో నిర్మించిన 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను సాంకేతికంగా చార్జ్ చేసి పరిశీలించారు. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో ఖమ్మంలోని ఖానాపురం, మమతరోడ్ సబ్ స్టేషన్లపై భారం తగ్గుతుందని, పలు ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని అధికారులు వివరించారు. అనంతరం ఖమ్మం మమత వైద్యశాల రోడ్డులోని సబ్‌స్టేషన్‌ను కూడా డైరెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడారు.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్, డీఈలు బాబూరావు, నంబూరి రామారావు, హీరాలాల్, భద్రు పవార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి మహేందర్‌రెడ్డిని కలిసిన డీపీఆర్‌ఓ



మంత్రిని సన్మానిస్తున్న డీపీఆర్‌ఓ శ్రీనివాసరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర సమాచారశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డిని డీపీఆర్‌ఓ శీలం శ్రీనివాసరావు శుక్రవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు 30 వరకు గడువు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు గడువు పొడిగించారు. ఈ విషయాన్ని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోపు ప్రవేశాలు పొందొచ్చని తెలిపారు. వివరాల కోసం సమీప సెంటర్లలో కానీ ఉమ్మడిజిల్లా కోఆర్డినేటర్ పాపారావు (80084 03522)ను కానీ సంప్రదించాలని సూచించారు.

కిన్నెరసాని నుంచి నీటి విడుదల



గేట్ ఎత్తివేయడంతో కిందకు పోతున్న నీరు

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలతో మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి వరద చేరుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లో నీటి మట్టం శుక్రవారం 405.70అడుగులకు చేరింది. దీంతో ఒక గేట్ ఎత్తి 5వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ సురేష్ తెలిపారు.

25న రామాలయ హుండీల లెక్కింపు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి దేవస్థానంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను ఈ నెల 25న లెక్కించనున్నట్లు ఈఓ ఎల్.రమాదేవి తెలిపారు. ఉదయం 8 గంటలకు హుండీలను తెరిచి చిత్రకూట మండపంలో లెక్కింపు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఆలయ ఉద్యోగులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

ఎస్సీ గురుకులాల్లో సీట్ల భర్తీకి నేడు స్పాట్ కౌన్సెలింగ్

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి శనివారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్సీఓ కె.ప్రత్యూష తెలిపారు. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల గురుకులాల్లో మిగిలిన సీట్లను అర్హులైన విద్యార్థులతో భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు శనివారం ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని డాక్టర్ అంబేడ్కర్ జూనియర్ కళాశాలలో జరిగే స్పాట్ కౌన్సెలింగ్‌కు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. కాగా, ఐదో తరగతిలో బాలికలకు 40, బాలురకు 26, ఆరో తరగతిలో బాలికలకు 24, బాలురకు ఎనిమిది, ఏడో తరగతిలో బాలికలకు 23, బాలురకు ఒక సీటు, ఎనిమిదో తరగతిలో బాలికలకు 17, బాలురకు 13, తొమ్మిదో తరగతిలో బాలికలకు 13, బాలురకు 18 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

కోడిగుడ్ల పంపిణీని అడ్డుకున్న మహిళలు



తలుపులకు అడ్డుగా నిలబడి అడ్డుకుంటున్న మహిళలు

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీబస్తీ గ్రామ పంచాయతీ రాజీవ్‌నగర్‌తండా గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్ల పంపిణీని స్థానిక మహిళలు శుక్రవారం అడ్డుకున్నారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సమ్మెలోకి వెళ్తూ పాఠశాలకు తాళం వేశారు. వేసి ఉన్న తాళం తొలగించి అందులో నిల్వ ఉన్న కోడిగుడ్లు పంపిణీ చేసేందుకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పూజ, సీఎస్పీబస్తీ గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ అంగన్‌వాడీ పాఠశాల వద్దకు వచ్చారు. విషయం తెలుసుకున్న స్థానిక మహిళలు తాళం తీయడాన్ని అడ్డుకున్నారు. కోడిగుడ్ల పంపిణీకి అంగీకరించబోమని పట్టుపట్టారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయుల సమ్మెకు తమ మద్దతు కూడా ఉందని స్పష్టం చేశారు. దీంతో చేసేది లేక సూపర్‌వైజర్, కార్యదర్శి తిరుగుపయనమయ్యారు.

పామాయిల్ గెలలు 	
టన్ను ధర	రూ.13,026

హెవీ వెహి'కిల్స్'



కొత్తగూడెం అండర్ బ్రిడ్జి వద్ద బోల్తా కొట్టిన యాష్ ట్యాంకర్ (ఫైల్)

- కేటీపీఎస్‌కు నిత్యం రవాణా సాగిస్తున్న యాష్ ట్యాంకర్లు
- అతి వేగంతో ప్రమాదాలు నిత్యకృత్యం
- ప్రాణాలు గాలిలో కలుస్తున్నా నియంత్రణ కరువు
- డేంజర్ స్పాట్లపై దృష్టి సారించని అధికారులు

పాల్వంచ: ఇటీవల భారీ వాహనాల రాకపోకల వల్ల ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాలో పలు కర్మాగారాలు, పరిశ్రమలు ఉండటంతో దిగుమతులు, ఎగుమతుల కారణంగా నిత్యం భారీ లారీల రాకపోకల రద్దీ విపరీతంగా పెరుగుతోంది. ఇక కేటీపీఎస్ నుంచి వెలువడే బూడిదను పలు కంపెనీలకు తరలించే ట్యాంకర్ల వల్ల ప్రమాదాలు మరింత పెరిగాయి. అతి వేగం, టర్నింగుల్లో సరైన మార్జిన్ తీసుకోకుండా వెళ్తుండటంతో చిన్నచిన్న ప్రమాదాలు సైతం పలువురిని నష్టపరుస్తున్నాయి. ఎటువైపు నుంచి ప్రమాదం ఎదురవుతుందో కూడా అర్థం కాని పరిస్థితి ఉంది. రోడ్డు విస్తరణ చేసినా కూడా రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. హైదరాబాద్, ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, విజయవాడ, రాజమండ్రి, దమ్మపేట వైపు నుంచి భద్రాచలం, మణుగూరు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వైపు జగదల్‌పూర్ నేషనల్ హైవేపై అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇవి గాక జిల్లాలో బీపీఎల్, హెవీ వాటర్ ప్లాంట్, సింగరేణి, కేటీపీఎస్, బీటీపీఎస్, నవభారత్‌తో పాటు బూర్గంపాడు చుట్టుపక్కల అనేక పరిశ్రమలకు నెలవుగా ఉండటంతో అతిపెద్ద వాహనాలు, లారీలు, ట్యాంకర్లు, లోడింగ్, అన్‌లోడింగ్ కోసం తిరుగుతున్నాయి. భద్రాచలం, వైజాగ్ వైపు విహార యాత్రలకు వెళ్లే వాహనాల సంఖ్య అధికమే. గతంలో నగరాలకు మాత్రమే పరిమితమైన అతిపెద్ద షాపింగ్ మాళ్లు ఇప్పుడు కొత్తగూడెంలో ఏర్పాటవుతుండటం, జిల్లా కలెక్టరేట్ కొత్తగూడెం – పాల్వంచ సరిహద్దుల్లో ఏర్పాటు చేయడంతో అన్ని వైపుల నుంచి ప్రజలు వచ్చి వెళ్తున్నారు. ఒకవైపు రోడ్డు పక్కనే అతి భారీ వాహనాలు నిలిపి ఉంచడంతో ప్రమాదాలు జరుగుతుండగా.. బూర్గంపాడు లక్ష్మీపురం వద్ద, సారపాక రోడ్డులో, పాల్వంచలోని నవభారత్, కొత్తగూడెం క్రాస్‌రోడ్ వద్ద, కొత్తగూడెం రుద్రంపూర్ రోడ్‌లో, మణుగూరు బీటీపీఎస్ రోడ్డు వద్ద లారీలు నిలిపి ఉంటాయి. రాత్రి తొమ్మిది తర్వాతే హైవేపై వాటి రాకపోకలకు అనుమతిచ్చారు. కానీ, ఈ వాహనాలపై సరైన నియంత్రణ లేకపోవడంతో ఎప్పుడు పడితే అప్పుడే భారీ వాహనాలు సైతం రోడ్డెక్కుతున్నాయి. ఈ ట్రాఫిక్ వల్ల నేషనల్ వైవేపై రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. ఇటీవల వరుస ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగించే అంశం.

స్కూల్ బస్‌ను ఢీకొట్టిన యాష్ ట్యాంకర్ (ఫైల్)



కొత్తగూడెం, పాల్వంచలో ఇటీవలి ప్రమాదాల వివరాలు..

- గత మే 29వ తేదీన లారీ కిందపడి యువకుడు దుర్మరణం చెందాడు. శ్రీనగర్‌కాలనీకి చెందిన బీటీపీఎస్ ఉద్యోగి అనుమల్ల శ్రీను కుమారుడు జీవన్‌రెడ్డి (22) మోటార్ సైకిల్‌పై రాహుల్‌గాంధీ నగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ బీసీఎంరోడ్‌లోని ఆశ్రమ పాఠశాల సమీపంలో మున్సిపల్ చెత్త బండికి తగిలి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో పాల్వంచ నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న లారీ జీవన్‌రెడ్డి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.
- జూన్ 3వ తేదీన ముందు వెళ్తున్న బోర్‌వెల్ వాహనాన్ని ట్రాలీ ఆటో ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. బీసీఎంరోడ్‌లో లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్ సమీపంలో ముందు వెళ్తున్న బోర్‌వెల్ వాహనాన్ని వెనుక నుంచి ట్రాలీ ఆటో ఢీకొట్టింది. దీంతో ఆటో ముందు భాగం తీవ్రంగా దెబ్బతిని తెలంగాణనగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ చింతాల వెంకటేశ్వర్లు(45) తీవ్రంగా గాయపడ్డాడు.
- జూన్ 9వ తేదీన మోటార్ సైకిల్‌ను యాష్ ట్యాంకర్ ఢీకొట్టడంతో యువతి దుర్మరణం చెందింది. మణుగూరుకు చెందిన సింగరేణి ఉద్యోగి గౌస్ కూతురు షేక్ సీమ(23) తన బంధువు షేక్ మహ్మద్ పాషాతో కలిసి మోటార్ సైకిల్‌పై కొత్తగూడెంలోని సీమ అక్క సిమ్రాన్ దగ్గరకు బయలుదేరారు. పాల్వంచ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్ సమీపంలో బీసీఎం రహదారిపై మోటార్ సైకిల్‌ను యాష్ ట్యాంకర్ వెనుక నుంచి ఢీకొట్టింది. సీమ లారీ వెనుక టైర్ల కిందపడి దుర్మరణం చెందింది.
- ఈ నెల 13వ తేదీన కేటీపీఎస్ నుంచి బూడిదను తరలిస్తున్న ట్యాంకర్ కొత్తగూడెం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద అదుపుతప్పి మీదపడటంతో చుంచుపల్లికి చెందిన శ్రీనివాస్, రాణి మృతి చెందారు. అతివేగం వల్లే మూలమలుపు వద్ద బోల్తా పడిందని స్థానికులు వాపోయారు.
- 16వ తేదీన పాల్వంచలోని అల్లూరి సెంటర్ వద్ద ప్రశాంత్‌కాలనీ వైపు నుంచి వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సును కేటీపీఎస్ కర్మాగారంలో బూడిద లోడు కోసం వెళ్తున్న యాష్ ట్యాంకర్ వెనుక భాగంలో ఢీకొట్టింది. తృటిలో పెనుప్రమాదం తప్పింది. కొత్తగూడెం విద్యానగర్ కాలనీలో ఓ పశువును సైతం ట్యాంకర్ ఢీకొట్టింది.

హస్తినలో ఆశావహులు



ఢిల్లీలో 'హస్తం' అభ్యర్థుల టికెట్ కసరత్తు

- ఇప్పటికే మధిర, భద్రాచలం క్లియర్
- కాంగ్రెస్ తొలి జాబితాలోనే తుమ్మల, పొంగులేటికి సైతం స్థానం?
- మిగతా ఆరు స్థానాల్లో పోటాపోటీ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు హస్తిన బాట పట్టారు. అభ్యర్థుల ఎంపిక కోసం పార్టీ స్క్రీనింగ్ కమిటీ ఢిల్లీలో కసరత్తు చేస్తోంది. ఈనెలాఖరులోగా తొలి జాబితా.. వచ్చేనెల రెండో వారానికల్లా అభ్యర్థుల ప్రకటన పూర్తవుతుందనే ప్రచారంతో తమ పేరు ఉండేలా చూసుకునేందుకు నేతలు పాట్లు పడుతున్నారు. పది నియోజకవర్గాలకు గాను రెండు చోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలను స్క్రీనింగ్ కమిటీ ఖరారు చేసింది. ఇక మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్లు కూడా తొలి జాబితాలో ఉండే అవకాశముందని సమాచారం. మిగతా స్థానాల్లో ఒక్కరిద్దరి అభ్యర్థులను సూచిస్తూ రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ.. సెంట్రల్ ఎన్నికల కమిటీ(సీఈసీ)కి పంపించగా... పరిశీలనలో నిమగ్నమయ్యారు.

120 దరఖాస్తులు

టీపీసీసీ సూచన మేరకు ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 120 మంది టికెట్ ఆశిస్తూ దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా ఇల్లెందు నుంచి 32 మంది దరఖాస్తు చేసుకోగా, పినపాక నుంచి 17 మంది, వైరా నుంచి 15 మంది, పాలేరు నుంచి 14 మంది, సత్తుపల్లి, కొత్తగూడెం నుంచి పది మంది చొప్పున, ఖమ్మం నుంచి తొమ్మిది మంది, అశ్వారావుపేట నుంచి ఎనిమిది మంది, భద్రాచలం నుంచి ముగ్గురు, మధిర నుంచి ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇల్లెందు, వైరా, పినపాక వంటి నియోజకవర్గాల్లో పోటీ ఎక్కువగా ఉంది.

ముగిసిన వడబోత

టికెట్ కోసం అందిన దరఖాస్తులను తొలుత పీఈసీ(ప్రదేశ్ ఎన్నికల కమిటీ) వడపోసి ఒకటి, రెండు దరఖాస్తులు వచ్చిన చోట, పోటీ లేని స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసింది. మిగిలిన చోట్ల ఒకటి నుంచి మూడు లోపు పేర్లతో జాబితాను స్క్రీనింగ్ కమిటీకి అందించింది. ఈ కమిటీ ఇప్పటికే పలుమార్లు సమావేశం కాగా.. ప్రస్తుతం ఢిల్లీలో భేటీ జరుగుతోంది. దీంతో టికెట్లు ఆశిస్తున్న వారు సైతం అక్కడకు చేరుకుని తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

ఎవరికి వారే ప్రయత్నాలు..

ఆశావహులు పలువురు నేతలను కలుస్తూ తమకు టికెట్ వచ్చేలా చూడాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. స్క్రీనింగ్ కమిటీ భేటీలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొననుండగా వారిని సైతం కలిసి విన్నవించుకున్నారు. మరోపక్క కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా తమ అనుచరుల అర్హతలు, వారికి టికెట్ ఇస్తే గెలిపించుకునే బాధ్యత తీసుకుంటామని చెబుతూ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

తొలి జాబితాలోనే ముఖ్యులు

కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితాను ఈ నెలాఖరులో విడుదల చేయాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలోనే మధిర నుంచి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, భద్రాచలం నుంచి భద్రాద్రి డీసీసీ అధ్యక్షుడు, సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్య అభ్యర్థిత్వాలు సీఈసీలోనే ఖరారైనట్లు తెలిసింది. ఇక ఢిల్లీలో స్క్రీనింగ్ కమిటీ బాధ్యులతో మాజీ ఎంపీ పొంగులేటి భేటీ అయ్యారు. ఆయన ఖమ్మం, పాలేరు, కొత్తగూడెం స్థానాలకు దరఖాస్తు చేసుకోగా, తొలి జాబితాలోనే ఆయన పేరు ప్రకటించనున్నట్లు సమాచారం. అలాగే, ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేరు సైతం ప్రకటించనున్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లాలోని పది స్థానాలకు గాను భట్టి, పొదెం తోపాటు తుమ్మల, పొంగులేటి పేర్లు తొలి జాబితాలోనే ఉంటాయని సమాచారం. కానీ పొంగులేటి, తుమ్మలను ఏ స్థానాల నుంచి బరిలోకి దింపుతారనే అంశంపై చర్చ జోరుగా సాగుతోంది.

మిగతా వారిపై ఉత్కంఠ

ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో నలుగురు ముఖ్య నేతల పేర్లు ఖరారైన నేపథ్యాన మిగిలిన ఆరుగురు అభ్యర్థులపై ఉత్కంఠ నెలకొంది. రిజర్వ్‌డ్ స్థానాలైన ఇల్లెందు, వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, పినపాక నియోజకవర్గాల్లో ఎక్కువ మంది ఆశావహులు ఉండడం, టికెట్ కోసం అందరూ తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. అయితే, గతంలో సునీల్ కనుగోలు చేసిన సర్వేలు, ఇతర అంశాల ప్రాతిపదికన టికెట్ల కేటాయింపు ఉంటుందని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. అభ్యర్థిని ప్రకటించడమే కాక టికెట్ రాని వారికి నచ్చచెప్పేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

అకౌంటింగ్ యాప్‌తో పారదర్శకత

ఇల్లెందురూరల్: పొదుపు సంఘాల లావాదేవీలు మరింత పారదర్శకంగా ఉండేందుకు నూతనంగా అకౌంటింగ్ యాప్ అందుబాటులోకి వచ్చిందని సెర్ప్ డీఎంజీ వీరభద్రం అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం అకౌంటింగ్ యాప్‌పై వీఓఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీలు ప్రస్తుతం వెబ్ ఆధారంగా జరుగుతున్నాయని ఇక నుంచి అకౌంటింగ్ యాప్‌లో లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. సమావేశాల నిర్వహణ, సభ్యుల హాజరు, సభ్యుల, సంఘాల బ్యాంకు లింకేజీ, రికవరీ, స్త్రీనిధి అప్పులు, రికవరీ, అంతర్గత అప్పులు, లీడర్షిప్ కొటేషన్, ఆడిట్, డీఎస్ఓ రిటర్న్స్ సబ్‌మిట్ చేయడం, ఆర్జించిన లాభాలు తదితర వివరాలన్నీ అకౌంటింగ్ యాప్‌లో పొందుపర్చాలన్నారు. ఇలా నమోదు చేసిన వివరాల ఆధారంగా ప్రతి సంఘానికి గ్రేడ్‌లు ఇస్తారని చెప్పారు. ప్రతి వీఓఏ మొబైల్ ద్వారా ఈ యాప్‌ను నిర్వహించుకోవచ్చని వెల్లడించారు. సమావేశంలో ఏపీఎంలు దుర్గారావు, సుభాష్, సీసీలు ఖమ్మంపాటి నర్సింహారావు, నాగేంద్ర, భూలక్ష్మి, రాంబాబు, సంపత్, రాంమ్మూర్తి, కొమ్మాలు, మండల సమాఖ్య అధ్యక్షకార్యదర్శులు నాగమణి, సౌజన్య, కోశాధికారి సద్గుణ, అకౌంటెంట్ నందకుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంజీ వీరభద్రం

అక్టోబర్ 10నుంచి సోలార్ ప్లాంట్లలో ఉత్పత్తి

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలో సోలార్ ప్లాంట్ల నిర్మాణ పనులను డైరెక్టర్(ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు శుక్రవారం పరిశీలించారు. తొలుత రూ.56 కోట్ల వ్యయంతో 55 ఎకరాల్లో చేపట్టిన 10.5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్ పనులను పరిశీలించిన డైరెక్టర్ వచ్చే నెల 10 నుండి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని సమకూర్చుకుని పనుల్లో వేగం పెంచాలని తెలిపారు. ఆతర్వాత గరిమెళ్లపాడు ప్రాంతంలో రూ.139 కోట్లతో 108 ఎకరాల్లో నిర్మిస్తున్న 22.5 మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్ నిర్మాణ పనులను కూడా డైరెక్టర్ పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏరి యా జీఎం ఎం.షాలెంరాజు, అధికారులు జానకీరాం, ప్రిజాల్డ్, శ్రీకాంత్, ఆనంద్ పాల్గొన్నారు.



ప్లాంట్ పనులను పరిశీలిస్తున్న డైరెక్టర్

అనుమానాస్పద స్థితిలో ఉపాధ్యాయుడు మృతి

అశ్వారావుపేటరూరల్: అనుమానాస్పద స్థితిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పెద్దం గ్రామానికి చెందిన తిరిగిపల్లి అరుణ్‌కుమార్(48) ఏలూరు జిల్లా కుక్కునూరులోని ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కొన్నేళ్లుగా అరుణ్‌కుమార్ మద్యానికి బానిసయ్యాడు. భార్య ఆయనతో దూరంగా ఉంటోంది. గురువారం రాత్రి కుక్కునూరుకు సమీపంలోని అశ్వారావుపేట మండలం కుడుములపాడు వద్దగల ఓ బెల్ట్ షాపులో మద్యం సేవించి, కాలి నడకన కొద్ది దూరం వెళ్లి రోడ్డు పక్కన కింద పడి మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం జరిపించి కుటుంబీకులకు అప్పగించారు. కాగా, అరుణ్‌కుమార్ గుండెపోటుతో మృతి చెందినట్లు మృతుడి సోదరుడు రవికుమార్ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం. కుటుంబీకులు గుండెపోటుతో మృతి చెందినట్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఇతడి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



అరుణ్‌కుమార్ మృతదేహం

మెడికల్ కళాశాల ఆవరణలో ఇష్టారాజ్యం

విచ్చలవిడిగా వచ్చివెళ్తున్న బయటి వ్యక్తులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఇటీవల ప్రారంభించగా, సరైన భద్రతా చర్యలు మాత్రం చేపట్టలేదు. పాత కలెక్టరేట్ భవనాన్ని కళాశాలకు కేటాయించగా గత నాలుగు రోజులుగా తరగతులు నిర్వహిస్తున్నారు. పాత కలెక్టరేట్‌లో తరగతులు నిర్వహిస్తుండగా, పక్కనే ఉన్న పాత ఆర్‌అండ్‌బీ కార్యాలయ భవనాన్ని బాలికల హాస్టల్‌కు కేటాయించారు. ఈక్రమంలో కలెక్టరేట్ ఆవరణలోని టీ స్టాల్‌కు బయటి వ్యక్తులు పెద్దసంఖ్యలో వచ్చి గంటల తరబడి మకాం వేస్తున్నారు. దీంతో తరగతి గదుల నుంచి హాస్టల్‌కు వెళ్లే క్రమాన విద్యార్థినులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈమేరకు సరైన రక్షణ చర్యలు లేకపోవడంపై తల్లిదండ్రులు పెదవి విరుస్తుండగా.. ఇకనైనా ప్రిన్సిపాల్ స్పందించాలని వారు కోరుతున్నారు.



కళాశాల ఆవరణలోని టీస్టాల్ వద్ద బయటి వ్యక్తులు, ద్విచక్ర వాహనాలు

నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురం గ్రామంలో నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కేశవ్‌రావు తన సిబ్బందితో కలిసి సీతారాంపురం గ్రామ శివారులో వాహన తనిఖీలు చేపట్టారు. ఓ వ్యక్తి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై 100 లీటర్ల నాటుసారా తరలిస్తూ పట్టుబడ్డాడు. నిందితుడిని ఎటపాక మండలం గుండివారిగూడెం గ్రామానికి చెందిన భూక్యా శంకర్‌గా గుర్తించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ గణేశ్ తెలిపారు.

ప్రెజర్‌బాంబ్ పేలి డీఆర్‌జీ జవాన్‌కు గాయాలు


చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ప్రెజర్ బాంబ్ పేలడంతో ఒక డీఆర్‌జీ జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మావోయిస్టు పార్టీ వారోత్సవాల నేపథ్యాన డీఆర్‌జీ బలగాలు విస్తృతంగా కూంబింగ్ చేస్తున్నాయి. శుక్రవారం బీజాపూర్ జిల్లా జంగ్లా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో పోలీస్ బలగాలే లక్ష్యంగా భూమిలో అమర్చిన ప్రెజర్‌బాంబ్‌ను గమనించని డీఆర్‌జీ జవాన్ సన్ను హేమ్లా తొక్కడంతో అది పేలి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను బీజాపూర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పేకాట స్థావరాలపై దాడి

పాల్వంచరూరల్: వేర్వేరు చోట్ల నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ కార్తీక్ కథనం ప్రకారం.. మండలంలోని పాతసూరారం గ్రామశివారు చెరువుకట్ట చెట్టుకింద ఇద్దరు వ్యక్తులు పేకాడుతుండగా పట్టుకుని వారి వద్ద నుంచి రూ.3,800 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పుల్లాయిగూడెంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఐదు సెల్ ఫోన్లు, రూ.6,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ పోలీసులు అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయిని పట్టుకున్నారు. సీఐ నాగరాజురెడ్డి శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద ఎస్‌ఐ విజయలక్ష్మి వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో ద్విచక్రవాహనంపై యువకుడు 10 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. హైదరాబాద్‌కు చెందిన ముడిమాడుగుల జగదీశ్ ఒడిశా సరిహద్దుల్లో గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్ తరలిస్తున్నట్లు తేలిందని సీఐ చెప్పారు. గంజాయి విలువ సుమారు రూ. 2 లక్షలు ఉంటుందని, కేసు నమోదు చేశామని సీఐ నాగరాజురెడ్డి పేర్కొన్నారు.



నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

వరకట్నం కేసులో జైలుశిక్ష, జరిమానా

ఖమ్మంలీగల్: వరకట్నం కోసం భార్యను వేధించిన వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్షతోపాటు రూ.10వేల జరిమా నా విధిస్తూ ఖమ్మం మొబైల్ కోర్టు న్యాయమూర్తి రాళ్లబండి శాంతిలత శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఖమ్మం బుర్హాన్‌పురానికి చెందిన షహనాజ్‌బేగం అలియాస్ ఫాతిమాకు నెహ్రూనగర్‌కు చెందిన సయ్యద్ ఫర్వేజ్ అలియాస్ అబ్దుల్ హఫీజ్‌తో 2016లో వివాహం జరిగింది. పెళ్లి సమయాన 20 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ.3 లక్షల నగదు, రూ.2 లక్షల విలువైన సామగ్రి ఇచ్చారు. అయినప్పటికీ ఆయన మరింత కట్నం తీసుకురావాలని భార్యను వేధించసాగాడు. గతంలో ఫర్వేజ్‌కు వివాహం జరిగిన విడాకులు తీసుకున్నట్లు ఆలస్యంగా తెలుసుకున్న ఫాతిమా మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఆమె భర్తతో పాటు మామ మేనమామ, మామపై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా మామ, మేనమామపై కేసు రుజువు కాలేదని కొట్టేయగా, ఫర్వేజ్‌కు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈకేసును ప్రాసిక్యూషన్ తరఫున వి.నర్సయ్య వాదించగా.. కానిస్టేబుల్ సైదులు సహకరించారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని రైల్వేస్టేషన్‌లో శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తరలిస్తున్న 22.5 కేజీల గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జీఆర్పీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లోని రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై ఆగిన కోణార్క్‌లో తనిఖీ చేయగా, ఓ బ్యాగ్‌లో తరలిస్తున్న రూ.2.5లక్షల విలువైన గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. అయితే, గంజాయి తరలిస్తున్న వ్యక్తులు మాత్రం పట్టుబడలేదు. తనిఖీల్లో జీఆర్పీ సీఐ శ్రీనివాస్, ఎస్సై భాస్కర్ రావు ఆర్పీఎఫ్ ఎస్సై త్రివేణి, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై షేక్ ముబషీర్ అహ్మద్, హెడ్‌కానిస్టేబుల్ కరీం పాల్గొన్నారు.